క్లుప్తంగా

ఓపెన్ డిగ్రీ విద్యార్థులు సెమిస్టర్ ఫీజు చెల్లించాలి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీసెంటర్‌లో చదువుతున్న మొదటి, ద్వితీయ, తృతీయ విద్యార్థినీ, విద్యార్థులు మొదటి, మూడు, ఐదవ సెమిస్టర్‌లకు సంబంధించిన ఫీజును గురువారంలోగా చెల్లించాలని కో ఆర్డినేటర్ సదాశివయ్య పిలుపునిచ్చారు. ఆన్‌లైన్‌సెంటర్‌లలో ఎక్కడైనా ఫీజు చెల్లించవచ్చని ఆయన సూచించారు.

నేడు క్విజ్ పోటీలు

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్ జెడ్పీహైస్కూల్‌లో బుధవారం బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ సౌజన్యంతో నియోజకవర్గ స్థాయి పదో తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం మారేపల్లి శ్రీనివాసులు తెలిపారు. క్విజ్ పోటీలకు డీఈఓ ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన బైకని శివ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.50లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎల్‌ఓసీని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మంగళవారం లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు యాదయ్య, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్మీయడిట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు గత సంవత్సరం ఫెయిల్ అయిన, సప్లమెంటరీ రాసే వారు కేవలం 10 నుంచి 20 మంది మాత్రమే ఉన్నారు. వాటితో పాటు ఎన్విరాల్‌మెంట్ పరీక్ష మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈనెల 30న జరగనున్నాయి. ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 31న మొదటి సంవత్సరం విద్యార్థులకు, ఫిబ్రవరి 1న రెండో సంవత్సరం విద్యార్థులకు జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22వ తేదీ వరకు వివిధ ఒకేషనల్, జనరల్ కోర్సు ల వారికి నిర్వహించనున్నారు. మొత్తం అన్ని పరీక్షలకు 9,300 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

‘ఎన్‌టీఆర్’ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం జిల్లా కేంద్రంలోని డీసీసీబీ బ్యాంకులో క్షేత్రస్థాయి పర్యాటనకు వెళ్లి, బ్యాంకు పనితీరు, లావాదేవీలు తదితర అంశాలను తెలుసుకున్నారు.

మహిళా ఆత్మీయ భరోసా విస్తరించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో విజయవంతంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మహిళా ఆత్మీయ భరోసా ఆర్థికసాయం మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచిందని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారుఖ్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని స్ఫూర్తిగా తీసుకొని మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లలో విస్తరింపజేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నేడు బీఆర్ఎస్ మండల స్థాయి సమావేశం

నవాబుపేట: మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ రోడ్డులో కార్యకర్తల సమావేశానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన తెలిపారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, ప్రతాప్, గోపాల్‌గౌడ్ ఉన్నారు.

నిధులు మంజూరు చేయండి

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద టాయిలెట్ల నిర్మాణానికి స్వచ్ఛభారత్ ద్వారా నిధులు మంజూరు చేయాలని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. దేవస్థాన కమిటీ చైర్మన్ రాఘవేంద్రచారి, ఈఓ కవిత, ప్రసాద్‌లు ఎంపీడీఓను కలిసి వివరించారు. దేవస్థానం నిధులతో పనులు చేపట్టామని, మిగతా పనులకు కావలిసిన నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

- నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు: ట్రాఫిక్ నిబంధనలకు లోబడి ప్రతి ఒక్క డ్రైవర్ వాహనాలు నడపాలని, ప్రధానంగా ప్రతి ఒక్కరికీ ఇన్సూరెన్స్ ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని అల్మాస్ ఫంక్షన్ హాల్లో ఆటో డ్రైవర్లకు, లారీ డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ వారి ప్రాణాలకు వాళ్లే భద్రత కల్పించుకోవాలని, ప్రమాదాలు ఏ రూపంలో వస్తాయో తెలియదు కనుక ప్రతి ఒక్కరు ఆరోగ్య బీమా తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో ఉన్న ఆటో, మ్యాక్సీక్యాబ్ డ్రైవర్లకు అండగా ఉంటానని, డ్రైవర్లకు సంబంధించిన పూర్తి వివరాలు తయారు చేయడం జరుగుతుందన్నారు. అంతకుముందు డీటీసీ కిషన్ మాట్లాడుతూ దేశంలో ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ప్రతి గంటకు ఏడుగురు చనిపోతున్నారని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అనంతరం రోడ్డు మాసోత్సవాలపై ఏర్పాటు చేసిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్టీఓ రఘుకుమార్, సీనియర్ ఎంవీఐ వాసుదేవ్‌రావు, వర్టికల్ డీఎస్పీ సుదర్శన్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, ట్రాఫిక్ సీఐ భగవంతురెడ్డి, వన్‌టౌన్ అప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటా

స్టేషన్ మహబూబ్‌నగర్: మత్స్యకారులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలుగు ముదిరాజ్ మత్స్యకారుల నూతన సంవత్సర క్యాలెండర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ముదిరాజ్‌లు కష్టపడే తత్వంతో సమాజానికి ఏదైనా చేయాలనే మంచి ఆలోచన కలిగి ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షులు గంజి ఆంజనేయులు, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, నవాబ్‌పేట మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, సిగ్ర నారాయణ, జిల్లా మహాసభ అధ్యక్షులు ప్రభాకర్ పాల్గొన్నారు.

సాంస్కృతిక ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

వచ్చేనెల 5, 6 తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరిగే సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నిర్వాహకులు బెక్కం జనార్దన్, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, మనోహర్ ఉన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి కోర్సు వివరాలు, విద్యార్థుల ఉపాధి అవకాశాలపై ప్రిన్సిపాల్ శాంతయ్యను అడిగి తెలుసుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద అధునాతన హంగులు

బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అధునాతన హంగులను (చుట్టూ రెయిలింగ్, లైటింగ్) రాత్రి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

భక్తి శ్రద్ధలతో షబ్ ఏ మేరాజ్



మసీదులో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ముస్లింలు

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం రాత్రి ‘షబ్ ఏ మేరాజ్ ఉన్ నబీ సాల్లేలాహు తాల అలైవ సల్లం’ వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జామా మసీద్‌లో ప్రత్యేక నమాజ్, ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ప్రముఖ ముస్లిం ఆధ్యాత్మిక వక్త ఆధ్యాత్మిక సంస్థ జామియా నిజామియా హైదరాబాద్‌కు చెందిన హజ్రత్ ఉల్ అలమ్మ మౌలానా మహ్మద్ షబ్బీర్ అహ్మద్ షబ్ ఏ మేరాజ్ ప్రత్యేకత గురించి ముస్లిం సోదరులకు వివరించారు. మనిషి ఎల్లప్పుడు భక్తిమార్గంను అవలంబించాలని, మహ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో జామ మసీద్, మదీనా మసీద్ ఉమ్మడి మసీదుల కమిటీ అధ్యక్షుడు జనాబ్ మహ్మద్ సాదిక్, కమిటీ సభ్యులు మహ్మద్ సాదిక్, జామ మసీద్ ఇమాం సయ్యద్ షరీఫ్, మౌజానా మహ్మద్ అమీరొద్దీన్, మహ్మద్ రషీద్, మహ్మద్ సాదిక్, మహ్మద్ ఖాసీం ఖురేషి, జహంగీర్, అలీం, ఎండీ యాసీన్, ఖాదర్, ఇసాక్ తదితరులు ఉన్నారు.

డప్పు మహాప్రదర్శనను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు శ్రీరాములు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం లక్ష గొంతుకలు.. వేల డప్పుల మహా ప్రదర్శన కార్యక్రమం బుధవారం జడ్చర్లలో ఉంటుందని, ఈ ప్రదర్శనలో డప్పు కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు బాలరాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు శ్రీరాములు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీఎన్జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష డప్పులు, వేల గొంతుకల సన్నాహక సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణమాదిగ పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, డప్పు కళాకారులు, అనుబంధ సంఘాల నాయకులు సన్నాహక సమావేశానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శేఖర్, కృష్ణ, ప్రవీణ్, రామచందర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మందకృష్ణ మాదిగ రాక

జడ్చర్ల టౌన్: పట్టణంలోని చంద్రగార్డెన్‌లో బుధవారం మధ్యాహ్నం నిర్వహించే వేలగొంతుకలు లక్ష డప్పుల మహా ఆయుధ ప్రదర్శన సభకు సంబంధించిన సన్నాహక సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నట్లు ఆ సంఘ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్య మాదిగ స్పష్టం చేశారు.

ఒంటికాలుపై నిలబడి నిరసన

కోయిల్‌కొండ: గార్లపహాడ్ గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించాలని జేఏసీ నాయకులు మంగళవారం ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కో కన్వీనర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాటను స్థానిక ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వారు కోరారు. గార్లపహాడ్ మండలంగా ప్రకటించాలని 10 గ్రామాల ప్రజల మద్దతు ఉందని, ప్రభుత్వం వెంటనే మండలంగా ప్రకటించాలని వారు కోరారు.

స్థలం కేటాయించాలని ధర్నా



మిడ్జిల్: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీలో చేసిన వెంచర్‌లో 10 శాతం స్థలంలో క్రికెట్ గ్రౌండ్ కోసం స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో క్రీడాకారులు అంబేడ్కర్ భవనం వద్ద ధర్నా చేశారు. వారికి మాజీ ఎంపీపీ సుదర్శన్, నాయకులు వెంకట్‌రెడ్డి, సురేష్ మద్దతు తెలిపారు. ధర్నాలో భాస్కర్, రవీందర్, వరుణ్, శ్రీను, క్రాంతి, రాఘవేందర్ పాల్గొన్నారు.

పశువైద్యశాల తనిఖీ



దేవరకద్ర: మండల కేంద్రంలోని పశువైద్యశాలను మంగళవారం జిల్లా జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్ తనిఖీ చేశారు. వైద్యశాలలో పశువులు, గొర్రెలు, మేకలకు అందిస్తున్న వైద్య సేవలకు సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించారు. గొర్రెలు, మేకలకు వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పశువులకు సంబంధించి టీకాలు ఇవ్వాలని కోరారు.

అసెంబ్లీలో దేవరకద్ర విద్యార్థులు



దేవరకద్ర: దేవరకద్ర జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం హైదరాబాద్‌లో అసెంబ్లీని సందర్శించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అసెంబ్లీ సెక్రటరీతో మాట్లాడి విద్యార్థులు అసెంబ్లీని చూసేందుకు అనుమతి ఇప్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు అసెంబ్లీని చూసిన అనంతరం ఎమ్మెల్యేతో గడిపారు. విద్యార్థులకు అసెంబ్లీ సమావేశాలపై, పలు అంశాలను ఎమ్మెల్యే వివరించారు.

డీఈఐసీ కేంద్రానికి ఆట వస్తువుల వితరణ



పాలమూరు: జడ్చర్లలోని ఎస్‌వీకేఎం పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఎన్ఆర్‌సీ, డీఈఐసీ సెంటర్లలో ఉండే చిన్నారులకు రూ.30వేల విలువ చేసే ఆట వస్తువులు, ఎలక్ట్రిక్ కుక్కర్, ప్రెషర్ కుక్కర్‌లను మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో వైద్య నిధి ఏర్పాటు చేసి దాని ద్వారా వస్తువులు కొనుగోలు చేసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో వితరణ చేయడమనే ఆలోచన విద్యార్థుల్లో కల్పించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ పద్మజ, భాస్కర్ నాయక్, ఆర్ఎంఓ జరీనా, ఎస్‌వీకేఎం ప్రిన్సిపాల్ ఎబినైజర్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతుకు రూ.5.20 కోట్లు మంజూరు

మిడ్జిల్: మండలంలోని కుర్వగడ్డపల్లి నుంచి బైరంపల్లి, కంచన్‌పల్లి, దోనూర్ వరకు 8కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు మరమ్మతులకు రూ.5.20 కోట్లు మంజూరైనట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి తెలిపారు. రోడ్డు మరమ్మతుతో ఐదు గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మాష్టి కుల రాష్ట్ర కమిటీ ఎన్నిక

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎస్సీ మాష్టి కుల సంఘం రాష్ట్ర కమిటీని మంగళవారం సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా దంతనపల్లి చిన్నస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దర్శనం వెంకటయ్య, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా ఫకీరయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

జడ్చర్ల కోర్టు ఏజీపీగా భాస్కర్‌రెడ్డి



జడ్చర్ల టౌన్: జడ్చర్ల జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా న్యాయవాది భాస్కర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జడ్చర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య తెలిపారు. ఈ మేరకు కోర్టు ఆవరణలో ఏజీపీ భాస్కర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ప్రభుత్వానికి సంబంధించిన కేసులను చూసుకోవడానికి మూడేళ్లపాటు గడువుతో ఆయనను నియమించినట్లు చెప్పారు. భాస్కర్‌రెడ్డి నియామకంపై న్యాయవాదులు యాదిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాలిక్‌షాకీర్, ఇఫ్తేకారొద్దీన్, రాములు, రమేష్, పాండు, తిరుపతి అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన



దేవరకద్ర: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నాగన్న సూచించారు. దేవరకద్ర బ్రిలియంట్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంకు అధికారుల మంటూ మోసానికి పాల్పడుతుంటారని, ఓటీపీలు చెప్పరాదని, మేసేజ్‌లు ఓపెన్ చేయరాదని సూచించారు. ఈ విషయంపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ బటన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

చిన్నచింతకుంట: విద్యార్థులు రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఆర్ శేఖర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

హన్వాడ: అత్తగారింటికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని చిన్నదర్పల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తకోట మండలం పాలెం గ్రామానికి చెందిన బత్తుల వెంకటయ్య ఈనెల 10న తన అత్తగారి ఊరు చిన్నదర్పల్లికి వచ్చి తిరిగి వెళ్లాడు. అలా వెళ్లిన వ్యక్తి అటు సొంతూరుకు వెళ్లక, ఇటు అత్తగారింటికి రాలేదు. అతని భార్య బత్తుల శాంతమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్



నవాబుపేటలో కేజీబీవీలో విద్యార్థులతో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

నవాబుపేట: విద్యార్థినులు బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏతో పాటు పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. మెనూ కచ్చితంగా అమలు చేసి విద్యార్థినులకు సమస్యలు రాకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రాథమిక ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో కలిసి అన్ని వార్డులు పరిశీలించారు. కేజీబీవీ కళాశాలకు ప్రహరీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, ఎంఈఓ నాగ్యనాయక్, డాక్టర్ శ్రావణ్‌కుమార్, ప్రిన్సిపాల్ మాధవి, భద్రు నాయక్, నరేష్‌గౌడ్ ఉన్నారు.

అపార్ కార్డుల నమోదుపై దృష్టి సారించండి

- జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

జడ్చర్ల టౌన్: విద్యార్థులకు ఆధార్‌కార్డు తరహాలో అపార్‌కార్డు జారీ చేస్తున్నందున, వాటి నమోదుపై దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో జరుగుతున్న స్కూల్‌కాంప్లెక్స్ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఇప్పటి వరకు మండలంలో 20 పాఠశాలలు అపార్ నమోదు చేయలేదని, వారంతా వెంటనే ఒక్కవిద్యార్థి వివరాలైనా నమోదు చేయాలన్నారు. మారుమూల గ్రామాల్లోనూ అపార్‌కార్డుల నమోదులు జరుగుతున్నాయన్నారు. విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపుకోసం కృషిచేయాలన్నారు. సమావేశంలో ఎంఈఓ మంజులాదేవి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కందూర్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన కందూర్ విద్యార్థులు

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల జీహెచ్ఎం, ఎంఈఓ కురుమూర్తి తెలిపారు. 7వ తరగతికి చెందిన సాయితేజ, జుబేర్, 8వ తరగతికి చెందిన అంజలి, ప్రవళికలు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–14 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈనెల 29 నుంచి 31 వరకు మెదక్ జిల్లా తుఫ్రాన్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు పీఈటీ బి.నాగమణి తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మొక్తదీర్ బాబాఉర్సు



మూసాపేట దర్గాలో ప్రార్థన చేస్తున్న భక్తులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని హజ్రత్ అబ్దుల్ మొక్తదీర్ బాబా దర్గా వద్ద మంగళవారం రాత్రి ఉర్సు నిర్వహించారు. మొక్తదీర్ బాబా ఇంటి నుంచి గంధాన్ని బయటకు తీశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గా వద్ద గంధంను సమర్పించి ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం మొక్తదీర్ బాబా ఇంటి వద్ద గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, నాయకులు మహేందర్, మైనారీలు మైనొద్దీన్, టైలర్ కలీం, పాష, మొక్తార్, ఖాదర్, తాజొద్దీన్, ఖలీల్, అబిద్ పాల్గొన్నారు.

‘స్పోకెన్ ఇంగ్లిష్’ సంస్థపై చర్యలు తీసుకోవాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని ఓ స్పోకెన్ ఇంగ్లిష్ సంస్థపై చర్యలు తీసుకోవాలని చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక టీఎస్‌జీఓ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇనిస్టిట్యూట్‌లో జరుగుతున్న మోసాలకు డీఈఓ బాధ్యత వహించాలని, అక్కడ చదువుతున్న విద్యార్థుల మానసిక పరిస్థితిపై విచారణ చేయాలన్నారు. ఫ్యాకల్టీ లేకుండా విద్యార్థులకు సబ్జెక్టులు ఒక్కరే ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. మొత్తం విద్యాసంస్థలపై టీచర్ సంఘాలు కలిసి నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడాలని, ఇనిస్టిట్యూట్లో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేయాలన్నారు. ఆ సంస్థ నిర్వాహకుడిని అరెస్టు చేసి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే డీఈఓ ఆఫీస్ ముందు నిరసన తెలియజేస్తామని ప్రకటించారు. అనంతరం కరపత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో కేఏఎస్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు లక్ష్మన్, టీపీజేఏసీ రాష్ట్ర కన్వీనర్ రవి, చంద్రశేఖర్, చైతన్య మహిళా సంఘం నాయకురాళ్లు కస్తూరి, శ్రీదేవి, బాధితులు మహేశ్వరి, చంద్రకళ పాల్గొన్నారు.

రెండు భాషల్లో ప్రశ్నాపత్రం ముద్రించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి కేవలం ఒక్క ఇంగ్లిష్ భాషలోనే ప్రశ్నాపత్రం ఇస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ముద్రించాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గతేడాది రెండు భాషల్లో ముంద్రించి ఈసారి ఇంగ్లిష్‌లో అధికారులకు అనుగుణంగా ముద్రించడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం ఇంగ్లిష్‌లోనే బోధన, పూర్తి స్థాయి సిబ్బంది, ల్యాబ్‌ల వంటివి బీఈడీ కళాశాలల్లో కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీ అభ్యర్థుల సంఘం నాయకులు రమేష్, నాగరాజు, సురేందర్, ఎస్ఎస్‌యూఐ వంశీ, గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ నాయకులు భరత్ ఉన్నారు.

ఇన్‌చార్జి కమిషనర్‌గా లక్ష్మారెడ్డి



దేవరకద్ర ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకుంటున్న లక్ష్మారెడ్డి

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీకి మంగళవారం ఇన్‌చార్జి కమిషనర్‌గా లక్ష్మారెడ్డి విధుల్లో చేరారు. జడ్చర్ల మున్సిపాలిటీ కమిషనర్‌గా ఉన్న ఆయన ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. దేవరకద్ర మేజర్ గ్రామ పంచాయతీ ఇక నుంచి మున్సిపాలిటీ హైడ్రాలోకి మారనుంది. మేజర్ పంచాయతీ ఈఓ సీత్యానాయక్ కమిషనర్ లక్ష్మారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. దేవరకద్ర గ్రామ పంచాయతీ కార్యాలయం మున్సిపాలిటీ కార్యాలయంగా మారింది. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో దేవరకద్రతో పాటు మినుగోనిపల్లి, పెద్దగోప్లాపూర్, బల్సుపల్లి, చౌదర్‌పల్లి గ్రామాలను విలీనం చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కు.ని. ఆపరేషన్లు ప్రారంభించాలి



డీఆర్‌ఓ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మూడు నెలల నుంచి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం లేదని దళిత సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్‌ఓ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ నియంత్రణ పాటించాలని చెబుతుంటే, జిల్లా ఆస్పత్రిలో మాత్రం కు.ని. ఆపరేషన్ కోసం పేర్లు నమోదు చేయించుకుని నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందని డీఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లారు. డీఆర్‌ఓను కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ ఆర్ఆర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సింగిరెడ్డి పరమేశ్వర్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.కుర్మయ్య, బహుజన మహానీయుల శోభయాత్ర కమిటీ జిల్లా అధ్యక్షుడు పాతూరు రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.